

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 4న రక్తదాన శిబిరాలు

విజయనగరం టౌన్ : విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 4న జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డి.రాము తెలిపారు. ఆదివారం స్థానిక ఎల్‌బిజి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ఎస్ఎఫ్ఐ విద్యార్థుల సమస్యల పట్ల ఎన్నో పోరాటాలు చేపడుతోందన్నారు. అదే స్ఫూర్తితో అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా అల్లూరి బ్లడ్ డోనర్స్ క్లబ్, ఎస్ఎఫ్ఐ సంయుక్తంగా మెగా రక్తదాన శిబిరాలను జిల్లాలో అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజయనగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ పక్కన ఉన్న మెసానిక్ టెంపుల్‌లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో ఉన్న విద్యార్థులు, యువత, ప్రజలు సహకరించాలని కోరారు. వివరాలకు విజయనగరం - 7288849236, 9381768275, గజపతినగరం - 9705545164, చీపురుపల్లి - 9985825957, బొబ్బిలి - 7013378783 నంబర్లను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి జె.రవికుమార్ , పట్టణ కార్యదర్శి పి. రమేష్, కె.రమేష్ పాల్గొన్నారు.

'ఫెర్రో'కు విద్యుత్తు షాక్

ఫెర్రో పరిశ్రమలకు విద్యుత్తు షాక్ తగిలింది. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు ఛార్జీలు పెంచడంతో ఫెర్రో పరిశ్రమలకు తీవ్ర నష్టం వస్తోంది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఫెర్రో పరిశ్రమలను మూసివేసేందుకు యాజమాన్య అసోసియేషన్ తీర్మానించింది. ఇప్పటికే కార్మిక శాఖ అధికారులకు నోటీసులు కూడా అందించినట్లు తెలిసింది. ఇప్పటికే కొన్ని పరిశ్రమలు మూతపడి కార్మికులు రోడ్డున పడ్డారు. మిగిలిన పరిశ్రమలు ఈ నెల 15 నుంచి మూతపడనున్నాయి. ఫెర్రో పరిశ్రమలు మూతపడితే ప్రత్యక్షంగా ఉపాధి పొందుతున్న 20 వేల నుంచి 30 వేల మంది కార్మికులు, పరోక్షంగా లక్షలాది మంది రోడ్డున పడే ప్రమాదముంది.

మూతపడిన ఇంపెక్స్ పరిశ్రమ



- కరెంటు ఛార్జీల పెంపుతో తీవ్ర నష్టాలు
- 15 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా మూతపడనున్న ఫెర్రో పరిశ్రమలు!
- ఉపాధి కోల్పోనున్న కార్మిక కుటుంబాలు

ప్రజాశక్తి-బొబ్బిలి

రాష్ట్ర వ్యాప్తంగా 38 ఫెర్రో పరిశ్రమలు ఉన్నాయి. అందులో విజయనగరం జిల్లాలోనే 18 పరిశ్రమలు ఉండగా, మిగిలిన 20 పరిశ్రమలు శ్రీకాకుళం, విశాఖ, తదితర జిల్లాల్లో ఉన్నాయి. బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో 9 పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో బెర్రి పరిశ్రమలో తొమ్మిది, హీరో ఫెర్రో పరిశ్రమలో రెండు, ఇంపెక్స్ పరిశ్రమలో రెండేసి ఫర్నేషులు ఉన్నాయి. బొబ్బిలిలో ఉన్న సిరి ఫెర్రో, యోన, ఇంపెక్స్, గరివిడిలో ఉన్న ఆంధ్రా ఫెర్రో పరిశ్రమలు ఇప్పటికే మూతపడ్డాయి. కరెంటు ఛార్జీల భారంతో మిగిలిన పరిశ్రమలను సైతం ఈ నెల 15 నుంచి మూసివేసేందుకు ఫెర్రో యాజమాన్యాలు తీర్మానించాయి.

నడపడం కష్టమే

ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలపై విద్యుత్తు ఛార్జీల పెంపు తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ఫెర్రో పరిశ్రమలకు ముడి సరుకు ఎంత అవసరమో విద్యుత్తు కూడా అంతే అవసరం. రాష్ట్ర వ్యాప్తంగా 38 ఫెర్రో పరిశ్రమలు ఉన్నాయి. ఒక్కొక్క పరిశ్రమ రోజుకు 300 మెట్రిక్ టన్నుల నుంచి 1500 మెట్రిక్ టన్నుల వరకు ఫెర్రో ఉత్పత్తులను తయారు చేస్తాయి. వైసిపి అధికారంలోకి రాకముందు యూనిట్ విద్యుత్తు రూ.4.95కు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ కింద మరో 5 పైసలు వసూలు చేసే వారు. అప్పట్లో ఫెర్రో పరిశ్రమలకు యూనిట్ రూ.5కే ఇచ్చేవారు. వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత విద్యుత్తు ఛార్జీల పెంపుతో పాటు ఎలక్ట్రిసిటీ డ్యూటీ, డిమాండ్ ఛార్జీలు, ఇంధన సర్‌ఛార్జీలు వసూలు చేయడంతో యూనిట్‌కు రూ.8 వరకు ఖర్చవుతుంది. గతంలో కంటే యూనిట్‌కు రూ.3 పెరగడంతో ఫెర్రో పరిశ్రమలపై తీవ్ర ఆర్థిక భారం పడింది. దీంతో తీవ్ర నష్టాలు రావడంతో యాజమాన్యాలు నడపలేక పరిశ్రమలను మూసివేసేందుకు నిర్ణయించాయి.

విద్యుత్తు రాయితీ ఇస్తేనే మనుగడ

విద్యుత్తు రాయితీ ఇస్తేనే ఫెర్రో పరిశ్రమలకు మనుగడ ఉంటుంది. లేకుంటే ఫెర్రో పరిశ్రమలు దీర్ఘకాలికంగా మూత పడే ప్రమాదం ఉంది. ప్రత్యక్షంగా వేలాది మంది కార్మిక కుటుంబాలకు, పరోక్షంగా లక్షలాది కుటుంబాలకు ఉపాధి కల్పిస్తున్న ఫెర్రో పరిశ్రమలకు విద్యుత్తు రాయితీ ఇవ్వాలని కార్మికులు, ప్రజలు కోరుతున్నారు.

టన్ను ఉత్పత్తికి రూ.12 వేలు నష్టం

రాష్ట్రంలో టన్ను ఉత్పత్తి చేసేందుకు రూ.85 వేలు ఖర్చవుతోంది. బహిరంగ మార్కెట్లో రూ.73 వేలకు అమ్ముడుపోతోంది. దీంతో టన్నుకు రూ.12 వేల వరకు నష్టం వాటిల్లుతోందని వారి వాదన. రాష్ట్రంలో విద్యుత్తు ఛార్జీలు పెరగడంతో ఉత్పత్తి ఖర్చు పెరిగింది. పక్క రాష్ట్రాలలో విద్యుత్తు ఛార్జీలు పెరగకపోవడంతో ఉత్పత్తి ఖర్చు తగ్గడంతో తక్కువ ధరకు విక్రయిస్తున్నాయి. దీనివల్ల స్టీల్ పరిశ్రమలు ఎపి ఫెర్రో పరిశ్రమల వద్ద కొనుగోలు చేయకుండా ఇతర రాష్ట్రాల పరిశ్రమల నుంచి కొనుగోలు చేస్తున్నాయి. ఫలితంగా ఉత్పత్తులు అమ్ముడుపోకపోవడంతో ధర తగ్గించి అమ్మాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని యాజమాన్య ప్రతినిధులు వాపోతున్నారు.

శాస్త్రీయతను దెబ్బతీసేందుకు

సైన్స్ అవార్డుల రద్దు

కేంద్రం వైఖరికి నిరసనగా జెవివి ఆధ్వర్యంలో సైన్స్ వాక్

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

శాస్త్ర సాంకేతికతను, శాస్త్రీయ దృక్పథాన్ని దెబ్బతీసేందుకే కేంద్రం సైన్స్ అవార్డులను రద్దు చేసిందని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంవిఎన్ వెంకటరావు, రమణ ప్రభాత్, సాహితీ సంస్థ కన్వీనర్ చీకటి దివాకర్ ఆక్షేపించారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం విజయనగరంలో సైన్స్ వాక్ నిర్వహించారు. ముందుగా గురజాడ నివాసంలో గురజాడ అప్పారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ నుంచి మూడు లాంతర్లు, ఎంజి రోడ్డు, గంట స్తంభం మీదుగా బాలాజీ జంక్షన్ వరకు వాక్ జరిగింది. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యరంగంలోనూ కేంద్ర ప్రభుత్వం అశాస్త్రీయమైన ఆలోచనలు ప్రవేశపెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మానవాళి మనుగడలో విప్లవాత్మకమైన మార్పులను గుర్తించిన డార్విన్ సిద్ధాంతం రద్దుచేయడం సరికాదన్నారు. దీనివల్ల వల్ల సమాజం మరింత వెనుకబాటుకు గురౌతుందన్నారు. డార్విన్ సిద్ధాంతంతోపాటు భౌతిక, రసాయన శాస్త్రాలు, గణితం, చరిత్రలోని యునైటెడ్ పాఠ్యాంశాలను రద్దుచేయడానికి ప్రభుత్వం వద్ద ఉన్న హేతుబద్ధత ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. సైన్స్ అభివృద్ధి చెందితేనే కొత్త కొత్త ఆవిష్కరణలతో దేశాభివృద్ధి సాధ్యమౌతుందన్నారు. అటువంటి సైన్స్ ప్రోత్సాహాన్ని తగ్గించేలా 72 అవార్డులను కేంద్ర ప్రభుత్వం రద్దుచేస్తున్నట్టు ప్రకటించడం దారుణమన్నారు. ఇప్పటికే పరిశోధన రంగానికి నిధుల కేటాయింపులు భారీగా తగ్గించిందని వివరించారు. శాస్త్రీయతను నిలువరించి, దాని స్థానంలో ఖర్మ సిద్ధాంతాన్ని ప్రచారం చేసేందుకు ఇటువంటి చర్యలకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. ఇటువంటి చర్యలు రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధమన్నారు. సైన్స్ అవార్డుల రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో జెవివి నాయకులు వి.రాజగోపాల్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జె.రమేష్‌చంద్ర పట్నాయక్, నాయకులు డి.రాము, కె.శ్రీనివాసరావు, రౌతు విజయకుమార్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రామ్మోహన్, బాలరాజు, ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల యూనియన్ జిల్లా అధ్యక్షులు గంగా ప్రసాద్, శశిధర్, మేధావులు, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.



సైన్స్‌వాక్‌లో పాల్గొన్న జెవివి, పలు సంఘాల నాయకులు, మేధావులు, యువత, విద్యార్థులు

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై

నేడు సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

శృంగవరపుకోట నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై సిపిఎం ఆధ్వర్యాన సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడుతున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంలో చాలావరకు ప్రభుత్వ భూముల ఆక్రమణలు జరిగాయని, త్వరలోనే వాటి చిట్టాను మీడియాకు వెల్లడిస్తానని అధికార పార్టీ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఇటీవల ప్రకటించారని గుర్తుచేశారు. స్వయంగా అధికార పార్టీ ఎమ్మెల్సీ ప్రకటించడమంటే, ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైనట్లు సర్కారు అంగీకరించినట్లేనని తేల్చి చెప్పారు. ప్రభుత్వ భూములకు, ఆస్తులకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టంచేశారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని, అర్హులైన పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఇదే విషయమై తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపడుతున్నట్లు వివరించారు. ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోకుంటే, భవిష్యత్తు కార్యాచరణను రూపొందించి దశల వారీగా ఉద్యమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తామని హెచ్చరించారు.

4న టిడిపి చైతన్య రథయాత్ర

ప్రజాశక్తి విజయనగరం కోట

విజయనగరం నియోజకవర్గంలో ఈ నెల 4న టిడిపి చైతన్య రథయాత్ర (బస్సు యాత్ర) నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు తెలిపారు. ఆదివారం స్థానిక అశోక్ బంగ్లాలో టిడిపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐవిపి రాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న చంద్రబాబుతోనే భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా బస్సు యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ఈ బస్సుయాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా బస్సుయాత్ర షెడ్యూల్‌ను వివరించారు. సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు లక్ష్మీ వరప్రసాద్, కార్యదర్శి బంగారు బాబు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి జిల్లా ప్రధానకార్యదర్శి ఐవిపి రాజు

సర్వజన ఆస్పత్రిలో పెరిగిన వైద్య సేవలు

- ఐదేళ్ల తరువాతే సూపర్ స్పెషాలిటీ వైద్యం
- అప్పుడప్పుడూ వైద్య పరీక్షలకు అంతరాయం
- అయినా తగ్గని రోగుల తాకిడి

వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యాన నడిచే జిల్లా కేంద్రాసుపత్రిని మెడికల్ కళాశాల క్లినికల్ ఆసుపత్రిగా మార్పు చేయడంతో వైద్య సేవలు విస్తరించాయి. అందుకు తగ్గట్టే రోగుల తాకిడి పెరుగుతోంది. పెరిగిన రోగులకు సంఖ్యకు అనుగుణంగా సేవలందించే విషయంలో వైద్యాధికారులు, వైద్యులకు కొన్ని సవాళ్లు ఎదురవుతున్నాయి. ఘోషాసుపత్రి కూడా మెడికల్ కాలేజీకి అనుబంధంగావున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కళాశాల అడ్మినిస్ట్రేషన్‌తోపాటు క్లినికల్ పరిధిలోవున్న సర్వజన, ఘోషాసుపత్రుల్లో వైద్య సేవలపైనా అటు వైద్యాధికారులతోపాటు జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాల్సివుంది.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సుమారు ఏడాది క్రితమే విశాల సముదాయంతో కూడిన ఆసుపత్రి భవనాలను మెడికల్ కాలేజీకి అప్పగించారు. ఇక్కడ పనిచేసిన వైద్య విధాన పరిషత్ వైద్యులంతా ఆ విభాగంలో నడుస్తున్న ఏరియా ఆస్పత్రులకు, సిహెచ్‌సిలకు బదిలీ అయ్యారు. 222 బోధనా వైద్య పోస్టులు మంజూరు కాగా, ఇప్పటి వరకు 192పోస్టులు భర్తీ అయ్యాయి. మిగిలిన పోస్టులన్నీ జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయిలో అమలు చేయాల్సివుంది. ఇదే ఆసుపత్రిలో పనిచేస్తున్న సుమారు 250మంది సిబ్బంది యథాతథ స్థానాల్లో కొనసాగుతున్నారు. మెడికల్ కాలేజీకి అవసరమైన అదనపు సిబ్బందిని కూడా దశలవారీగా భర్తీ చేస్తున్నారు. కొన్ని నెలల క్రితం డాక్టర్ ఎస్.అప్పలనాయుడు సూరింటెండెంట్‌గా నియమితులయ్యారు. ఘోషాసుపత్రి కూడా మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉండనుంది. మొత్తం 430 బెడ్‌లు అందుబాటులో ఉన్నాయి. గతం నుంచి ఉన్న మెడిసిన్, జనరల్ సర్జరీ, పీడియాట్రిక్స్, డెంటల్, ఆర్థో తదితర విభాగాలకు తోడుగా టీచింగ్‌కు తోడ్పడే అటానమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రో బయాలజీ (పెథాలజీ), ఫ్లోరెన్సిక్ మెడిసిన్, ఎస్‌పిఎం తదితర అనుబంధ విభాగాలు అందుబాటులోకి వచ్చాయి. టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ విభాగాలు కలుపుకుని మెడికల్ కాలేజీలో మొత్తం 22 విభాగాలు ఉన్నాయి. దాదాపు అన్ని విభాగాల్లోనూ తగినంతమంది వైద్యులు ఉన్నారని సూపరింటెండెంట్ అప్పలనాయుడు తెలిపారు. ఈ నేపథ్యంలో మెడికల్ కాలేజీలో ఓపి, ఐపిల సంఖ్య పెరిగిందని ఆసుపత్రి అధికారులు చెబుతున్నారు.



మరోవైపు జిల్లా కేంద్రాస్పత్రిని మెడికల్ కాలేజీగా మార్పుచేశాక వైద్య సేవల విషయంలో రోగుల ఆశలు, ఆకాంక్షలు పెరిగాయి. అందుకు తగ్గట్టే రోగుల ఓపి, ఐపి కూడా పెరిగాయి. జిల్లా కేంద్రాసుపత్రి మెడికల్ కాలేజీగా మారిన తరువాత వైద్య సదుపాయాలు మరింతగా పెరిగాయి. ఈనేపథ్యంలో ఔట్ పేషెంట్ల సంఖ్య 10శాతం పెరిగింది. గతంలో రోజూ 1000 నుంచి 1100మంది వచ్చేవారు. ప్రస్తుతం 1100 నుంచి 1200మంది వరకు వస్తున్నారని అధికారులు చెబుతున్నారు. ఆ మేరకు ఇన్‌పేషెంట్ల సంఖ్యకూడా పెరుగుతోంది. కరోనా వంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు మెడికల్ కాలేజీ అప్రమత్తంగా ఉందని, అవసరమైనంత ఆక్సిజన్ నిల్వలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

కానీ, సొంతంగా స్కానింగ్ మిషన్లే లేకపోవడం, థైరాయిడ్ వంటి చిన్న చిన్న టెస్టులు కూడా స్థానికంగా చేయకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కార్డియాలజీ, నెఫ్రాలజీ తదితర సూపర్ స్పెషాలిటీ విభాగాలు మాత్రం ఇంకా అందుబాటులోకి రావాల్సివుంది. కీమో, రేడియేషన్ సేవలు స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో కొన్ని కేసులను విశాఖ కెజిహెచ్‌కు రిఫర్ చేయక తప్పని పరిస్థితి. కాలేజీలో తరగతులు ప్రారంభమయ్యాక అండర్ పోస్టుగ్రాడ్యూట్ తొలి బ్యాచ్ విడుదల కావాలంటే కనీసం 5ఏళ్ల సమయం పడుతుంది. ఆ తరువాతే కాలేజీలో పీజీ కోర్సులు అందుబాలోకి వస్తాయని ఆసుపత్రి అధికారులు చెబుతున్నారు. ఇలా కాలేజీలో పీజీ కోర్సులు అందుబాటులో వచ్చాక మాత్రమే సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి.

మెరుగైన వైద్య సేవలు



ఆస్పత్రిలో రోగుల సంఖ్య పెరిగింది. అందుకనుగుణంగానే మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రయత్నిస్తుం. పూర్తిస్థాయిలో వైద్యులు, వైద్య పరికరాలు ఉన్నాయి. అధునాతన లేబొరేటరీ ఉంది. క్లీనికల్ కళాశాల ప్రారంభించి ఏడాది కావస్తోంది. ఈకాలంలో ఎదురైన ఇబ్బందులను ఒక్కొక్కటిగా అధిగమిస్తున్నాం. రోగులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా పర్యవేక్షిస్తున్నాం.

- డాక్టర్ ఎస్.అప్పలనాయుడు, సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్

కాంట్రాక్టు లెక్చరర్ల జెఎసి కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కాంట్రాక్టు లెక్చరర్ల జెఎసి ఉమ్మడి విజయనగరం జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. స్థానిక గురాన సాధూరావు రెసిడెన్సీలో జెఎసి సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా చైర్మన్‌గా పి.రామ్‌కుమార్ (గుమ్మలక్ష్మీపురం), కో-చైర్మన్లుగా పి.నాగేశ్వరరావు (కురుపాం), పి.శ్రీనివాసరావు (చినమేరంగి), బి.లోకనాథం (కొత్తవలస), ఎల్.సంధ్య (నెలిమర్ల), ఎన్.భద్రవతి(చీపురుపల్లి), కె.బాబ్జి (మక్కువ)ను ఎన్నుకున్నారు. 2014 జూన్ రెండో తేది వరకు సర్వీసులో కొనసాగుతున్న కాంట్రాక్టు అధ్యాపకులు అందరినీ రెగ్యులర్ చేయాలని, ఐదేళ్ల సర్వీస్ నిబంధనను రద్దు చేయాలని వారు కోరారు.

'ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం'

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుని, భావితరాలకు అందమైన భారతదేశాన్ని అందివ్వాలని భారత్ బచావో సంస్థ రాష్ట్ర నాయకులు పి.రామారావు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక అంబేద్కర్ జంక్షన్‌లోని ప్రజా గ్రంథాలయంలో జిల్లా కన్వీనర్ కరీం అధ్యక్షతన ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశాన్ని రక్షించుకుందాం, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం, భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం, సెక్యులరిజాన్ని కాపాడుకుందాం, సమాఖ్య వ్యవస్థను కాపాడుకుందాం, మనువాద కార్పొరేట్ ఫాసిజాన్ని ఓడిద్దాం... అనే ఆరు నినాదాలతో భారత్ బచావో సంస్థ పనిచేస్తుందన్నారు. గ్రామ, మండల, నియోజక వర్గ స్థాయిలో ప్రచారం చేపట్టి, జిల్లా స్థాయిలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో-కన్వీనర్ పి.షణ్ముఖరావు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గోకా రమేష్‌బాబు, నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.వి.దుర్గారావు, సభ్యులు పి.చంద్రరావు, పి.అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

మద్యాన్ని నిషేధించాలి

ప్రజాశక్తి-విజయనగరం కోట

మద్యాన్ని నిషేధించాలని నవయువ సమాఖ్య జిల్లా అధ్యక్షులు అప్పలరాజు, కార్యదర్శి గిరి ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో మద్యనిషేధం వాల్ పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు మద్య నిషేధం విధించకుండా, ప్రభుత్వ షాపులను పెట్టి మరింత ఏరులై పారిస్తున్నారని చెప్పారు. ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారని ధ్వజమెత్తారు. మద్య నిషేధం దిశగా చర్యలు తీసుకోకపోతే మహిళలు తిరగబడే రోజు వస్తుందని హెచ్చరించారు.


8న బీమా చెల్లింపులు

- ముంజేరు, జగ్గయ్యపేట గ్రామాల్లో 323 మందికి రూ.50,13,731 లబ్ధి
- అందుబాటులో 80 శాతం వరి విత్తనాలు
- జీలుగ, పిల్లిపెసర, జనుములు కూడా సిద్ధం
- రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ
- 'ప్రజాశక్తి'తో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి.టి.రామారావు ముఖాముఖీ



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఈ నెల 8న రైతు దినోత్సవం సందర్భంగా 2022 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన పంటల బీమా సొమ్మును ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమచేస్తుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విటి రామారావు ప్రకటించారు. గడిచిన మూడేళ్లతో పోలిస్తే వ్యవసాయ ఉత్పత్తులు, ముఖ్యంగా వరి దిగుబడి ఎక్కువగా రావడం వల్ల ఈసారి బీమా సొమ్ము తగ్గే అవకాశముందన్నారు. రైతులు అపోహలు చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల్లో సుమారు 80 శాతం వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని, మిగిలినవి కూడా మూణ్నాలుగు రోజుల్లో అందుబాటులోకి రానున్నాయని వివరించారు. జీలుగ, పిల్లి పెసర, జనుము వంటి విత్తనాలు కూడా సబ్సిడీపై విరివిగా అందుబాటులో ఉంచామని చెప్పారు. విత్తనాలన్నీ స్థానిక భరోసా కేంద్రాల్లోనే లభ్యమౌతాయని తెలిపారు. ఈ వారం తనను కలిసిన ప్రజాశక్తికి వ్యవసాయ శాఖ జిల్లా అధికారి రామారావు ముఖాముఖీ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...



? పంటల బీమా సొమ్మును రైతులకు ఎప్పటిలోగా చెల్లిస్తారు?.

ఈ నెల 8న రైతు దినోత్సవం సందర్భంగా ఖరీఫ్ 2022 పంటకు సంబంధించి పంటల బీమా సొమ్మును ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేయనుంది. ఆ రోజు సిఎం జగన్మోహన్‌రెడ్డి కూడా ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. గత ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు అనుకూలించడం వల్ల గడిచిన మూడేళ్లతో పోలిస్తే అధిక దిగుబడి (సుమారు 3 క్వింటాళ్లు అదనం) వచ్చింది. ఈ నేపథ్యంలో బీమా సొమ్ము తక్కువగా వచ్చేందుకు అవకాశం ఉంటుంది.

? ఏయే గ్రామాల్లో ఎక్కువగా బీమా పొందే అవకాశం ఉంది?.

భోగాపురం మండలంలోని ముంజేరు, జగ్గయ్యపేట గ్రామాల్లో 323 మంది రైతులకు రూ.50,13,731 లబ్ధి చేకూరనుంది. ఇప్పటికే రైతులు, వారికి అందబోయే బీమా మొత్తం తదితర వివరాలతో కూడిన జాబితా ఆయా గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించారు. ఈ గ్రామాలతోపాటు జిల్లా వ్యాప్తంగా బీమా చెల్లింపుల్లో హెచ్చుతగ్గులు ఉంటే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించవచ్చు.

? వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయా?.

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 2,33,930 ఎకరాల్లో వరి సాగుచేసే అవకాశం ఉంది. ఈనేపథ్యంలో 42,308 క్వింటాళ్ల వరి విత్తనాలను ప్రభుత్వం జిల్లాకు కేటాయించింది. ఇప్పటికే 33,997 (80 శాతం) క్వింటాళ్ల విత్తనాలను జిల్లాలోని వివిధ రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయి. మిగిలిన విత్తనాలు మూణ్నాలుగు రోజుల్లో జిల్లాకు రానున్నాయి. జిల్లాలోని ప్రయివేటు విత్తన వ్యాపారుల వద్ద కూడా 18,500 క్వింటాళ్ల వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయి.

? విత్తనాల పంపిణీ ఎలా?.

రైతులంతా రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలి. అక్కడి సిబ్బంది సూచన ప్రకారం రైతులకు ఎన్ని విత్తనాలు కావాలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. రైతు భరోసా కేంద్రాల్లో గానీ, ప్రయివేట్ వ్యాపారుల వద్ద గానీ విత్తనాలను కొనుగోలు చేసిన రైతులు తప్పక విత్తన మొలకశాతం పరీక్ష చేసుకోవాలి. వరి పంటకు విత్తన మొలకశాతం 80 శాతం తప్పక ఉండాలి. మొలక శాతం 80 కన్నా తగ్గిన విత్తనం వల్ల దిగుబడి తగ్గిపోయే అవకాశం ఉంటుంది.

? భూసారాన్ని పెంచే విత్తనాలు సరఫరా చేస్తున్నారా?.

ఈ ఏడాది జీలుగ 1700 క్వింటాళ్లకు గాను 1594 క్వింటాళ్లు, కట్టె జనుము 1200 క్వింటాళ్లకు గాను 886 క్వింటాళ్లు, పిల్లి పెసర 200 క్వింటాళ్లకు గాను 136 క్వింటాళ్లు... మొత్తంగా 2616 క్వింటాళ్ల విత్తనాలను పంపిణీ చేస్తున్నాం. ఇప్పటికే విత్తనాలు రైతు భరోసా కేంద్రాలకు చేర్చాం.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఫెడరేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి కాంతారావు

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని

24న చలో కలెక్టరేట్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఈ నెల 24న చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపడుతున్నట్లు ఆ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.కాంతారావు తెలిపారు. స్థానిక ఎన్‌పిఆర్ శ్రామిక భవనంలో ఎపి రాష్ట్ర గవర్నమెంట్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా కో-కన్వీనర్ పి.దుర్గారావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 జూన్ రెండో తేదికి ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసిన కాంట్రాక్టు ఉద్యోగులను మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులర్ చేస్తామనడం అన్యాయమన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ప్రభుత్వం రెగ్యులర్ చేస్తుందనే ఆశతో ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు కొత్తగా వచ్చారని, ఏడాదే అయిందంటూ మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టారు. సిఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు గతేడాది చివరి వరకు పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. వీటిపై దశల వారీగా ఆందోళనలు చేపడతామని తెలిపారు. ఈ నెల 5న సిఎం జగన్‌కు, 8న ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి, హెచ్ఒడిలకు ఇ-మెయిల్స్ పంపించాలని, 15న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వినతిపత్రాలు ఇవ్వాలని, 20న వివిధ శాఖల ఉన్నతాధికారులకు వినతులు అందించాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో రెండో ఎఎన్ఎంల యూనియన్ జిల్లా అధ్యక్షులు జి.కళావతి, నాయకులు డి.విజయలక్ష్మి, కె.హైమావతి, సిఆర్‌టిల యూనియన్ నాయకులు వి.రమేష్, కంటింజెంట్ వర్కర్స్ జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసరావు, ఎన్‌టిఇపి హెల్త్ సూపర్వైజర్ ఎవి స్వామి తదితరులు పాల్గొన్నారు.

రహదారి పనుల పరిశీలన

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని మారుమూల ఆనవారం గ్రామానికి నిర్మిస్తున్న రహదారి పనులను ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్నప్పల నాయుడు ఆదివారం పరిశీలించారు. ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజనలో భాగంగా మండలంలోని జాతీయ రహదారి నుండి ఆనవారం వరకు ఆర్‌పిపిఎల్‌డబ్ల్యుబి కింద నిర్మిస్తున్న తారు రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. రోడ్ నిర్మాణ పనుల వివరాలను ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పనులను ప్రణాళిక బద్ధంగా సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ప్రాంతాల ప్రజల రాకపోకలకు, రవాణా సౌకర్యాలు కలిగేలా వీలైనంత త్వరగా పూర్తి స్థాయిలో రహదారులను వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు.


రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

పూణేలో బొబ్బిలి కార్టూన్ ప్రదర్శన

ప్రజాశక్తి- బొబ్బిలి

జులై 1న పూణేలో ఉన్న కార్టూన్ కంబైన్స్ అసోసియేషన్ బాలగంగాధర తిలక్ గ్యాలరీలో నిర్వహించిన ఇంటర్నేషనల్ కార్టూన్ ఫెస్టివల్ 2023లో స్థానిక కార్టూనిస్ట్ శ్రీ భాను గుండెడ్డి భాస్కరరావు కార్టూన్ ఎంపికై ప్రదర్శింపబడింది. పర్యావరణంలో వచ్చే మార్పులపై వేసిన ఈ కార్టూన్ పలువురి ప్రశంసలు పొందింది. ఈ విషయాన్ని నిర్వాహకులు తెలియజేశారు. ఈ సందర్భంగా స్థానిక సాహితీ మిత్రులు భానుకు అభినందనలు తెలియజేశారు

అక్రమంగా మట్టి తవ్వకాలు

ప్రజాశక్తి- బొబ్బిలి

రంగరాయపురం సమీపంలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు ఆదివారం సెలవు కావడంతో మట్టి దొంగలు రెచ్చిపోయారు. అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపి అప్పయ్యపేట-రంగరాయపురం మధ్యలో ఉన్న రియల్ ఎస్టేట్ లేఅవుట్లకు మట్టిని తరలిస్తున్నారు. అక్రమ మట్టి తవ్వకాలతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది. అక్రమ మట్టి తవ్వకాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రామతీర్థంలో వాసవీ క్లబ్ సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

వాసవి క్లబ్ రామతీర్థంలో ఆదివారం సేవా కార్యక్రమాలు నిర్వహించింది. వాసవి క్లబ్ డైరెక్టర్ దాచే పల్లి సీతారాం, ప్రోగ్రాం డైరెక్టర్ వాసన్ ఆధ్వర్యంలో పేద రైతులను సత్కరించి ఉచితంగా విత్తనాలు, ఎరువులు పంపిణీ చేశారు. మాజీ సైనికుడు శంకర రావుని సత్కరించారు. పేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు, చీరలు పంపిణీ చేశారు. మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సముద్రాల వెంకట దాలప్ప, పూసర్ల శ్రీనివాసరావు, అక్కింశెల సూర్య శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఇఒగా చంద్రశేఖర్

ప్రజాశక్తి - మెరక ముడిదాం

మండల విద్యాశాఖాధికారిగా ఎం. చంద్రశేఖర్ నియమితులయ్యారు. నెల్లిమర్ల మండలం జరజాపు పేట గ్రామానికి చెందిన ఈయన శ్రీకాకుళం జిల్లా కవిటి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ పదోన్నతిపై ఎంఇఒగా వచ్చారు. ఈ మేరకు సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు.

పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులుగా నాగిరెడ్డి

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక విశాఖ పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షునిగా నాగిరెడ్డి దేవుడు బాబుని ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పాల ఉత్పత్తిదారులకు ఒక్కొక్కరికి 8 లీటర్లు పాలు పట్టే స్టీల్ క్యాన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గుమ్మడి నరసింహమూర్తి టీచర్, నిరుకోగిడాలినాయుడు మాస్టారు, ఆదాపు రెడ్డి ముత్యాలు నాయుడు మాస్టారు, రంభ అప్పారావు, పాల కేంద్రం పిఎస్ సత్యారావు, పాల కేంద్రం డైరెక్టర్లు పాల్గొన్నారు.

వాలంటీర్ నియామకానికి దరఖాస్తులు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఆకులసీతంపేట గ్రామంలో ఖాళీగా ఉన్న గ్రామ వాలంటీర్ పోస్టు నియామకానికి దరఖాస్తులు చేసుకోవాలని ఎంపిడిఒ బిఎస్ఎస్ పట్నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి చదివి, స్థానికులై ఉండాలని, 18 సంవత్సరాలు నిండిన వారు అర్హులన్నారు. బిసిడి (పురుషుడు) ఆన్‌లైన్‌లో దరఖాస్తును ఈ నెల 3 మధ్యాహ్నం 4గంటల్లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 5న పరిశీలించి మౌలిక పరీక్ష 6న ఉంటుందన్నారు. అదే రోజు నియామక పత్రం అందిస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో పశువులమ్మ పండగ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని చామలపల్లిలో పశువులమ్మ పండగను భక్తి భావంతో ఆదివారం జరుపుకున్నారు. ఏటా ఇదే నెలలో పశువులు పండుగను జరుపుకోవడం ఆనవాతిగా వస్తుంది. పశువులు ఆరోగ్యవంతంగా ఉండాలని, పంటలు బాగా పండాలని, గ్రామ ప్రజలందరూ సుఖంగా ఉండాలని అమ్మవారిని గ్రామంలో మేళ తాళాలతో ఊరేగిస్తూ ఆలయానికి వెళ్లారు. పశువులన్నింటినీ ఒకే చోట చేర్చి పశువులపై ముగ్గురు జల్లి నుదుట కుంకుమ పెట్టి పశువులు వెన్నుపై మంచి నూనెను రాశారు. ఈ పండుగను గ్రామ సర్పంచ్ కోలా సతీష్, పాలకవర్గ సభ్యులు గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో నిర్వహించారు.


వృద్ధులకు నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న ఎస్ఐ వీరజనార్దన్

వృద్ధులను ఆదుకోవాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - కొత్తవలస

చివరి దశలో ఉన్న ఒంటరి వృద్ధులను ఆదుకోవడం పూర్వజన్మ సుకృతం అని ఎస్ఐ వీర జనార్దన్ అన్నారు. మండల కేంద్రంలో తుమ్మికాపల్లి గ్రామంలో ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ విశ్వనాథ హరికుమార్ ఆధ్వర్యంలో 37 మంది ఒంటరి వృద్ధులకు 12 రకాల నిత్యవసరాలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా ఇటువంటి వృద్ధులకు నిత్యవసర వస్తువులు ఇచ్చి ఆదుకోవడం ఎంతైనా అవసరమన్నారు. ఆగస్టు నెలలో వృద్ధులకు రూ.5వేలు సహాయం అందిస్తానని ఎస్ఐ ప్రకటించారు. తన కర్తవ్యంలో భాగంగా ప్రతినెల వృద్ధుల కోసం కొంత సహాయం చేయడంతో సేవ చేసుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమానికి దాతలు ఆదిరెడ్డి అప్పలనాయుడు, చిట్టెమ్మ దంపతులు, ఆదిరెడ్డి రవి హరిత దంపతులు తమ పుట్టిన సందర్భంగా 20 మంది ఒంటరి వృద్ధులకు నిత్యవసర సరుకులు సహాయం చేశారని ట్రస్ట్ ఛైర్మన్ విశ్వనాథ హరికుమార్ తెలిపారు. ప్రతి ఒక్కరు ట్రస్ట్ లో సభ్యులు కావాలని వృద్ధుల సంఖ్య పెరుగుతుందని, ప్రతి ఒక్కరికి సేవ అనేది ఒక బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ రవి, ట్రెజరర్ శ్రావణ్ కుమార్, ట్రస్ట్ సభ్యులు హరిత, మల్లేశ్వరరావు, శ్రీదేవి, నగేష్, ధర్మ, గోవిందరావు, హెడ్ కానిస్టేబుల్ చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి-విజయనగరంకోట

స్థానిక పిఎస్ఆర్ కాంప్లెక్స్‌లో ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం సభ్యులకు ఆదివారం సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా విశాఖపట్నం సాగర్ మధ్య హాస్పిటల్ వైద్యులు ప్రభాకర్ మాట్లాడుతూ వివిధ వ్యాధుల పై పలు సూచనలు చేశారు. ప్రాథమిక వైద్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సదస్సులో డాక్టర్ నవీన్, డాక్టర్ ఎస్.ఎల్ రావు, జోనల్ అధ్యక్షులు జంగం జోషి, గౌరవ అధ్యక్షులు మమ్ముల తిరుపతిరావు, కార్యదర్శి సభ్యులు వి.గౌరినాయుడు, జిల్లా అధ్యక్షులు చిరంజీవి, కార్యదర్శి కోట్ల పైడిరాజు, ఉమాశంకర్, మక్కువ రమణ, బి.గౌరి నాయుడు పాల్గొన్నారు.

ఎపి మో'డల్' స్కూల్

• వాచ్‌మెన్ లేదు.. ప్రహరీ లేదు.. • ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి - డెంకాడ

నాడు నేడులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పాటు అవసరం మేరకు పాఠశాలలకు నైట్ వాచ్‌మెన్‌లను కూడా ఏర్పాటు చేసింది. ప్రహరీలు లేని చోట ప్రహరీలు కూడా నిర్మించింది. అయితే దీనికి భిన్నంగా మండలంలోని అక్కివరం ఏపీ మోడల్ స్కూల్లో ఉంది. ఈ పాఠశాల నాడు నేడు మొదటి విడత కింద ఎంపికైంది. ఇందులో భాగంగానే పాఠశాలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేశారు. కానీ ప్రహరీ గోడ మాత్రం నిర్మించలేదు. ఈ పాఠశాలలో సుమారు 700 మంది విద్యార్థులు ఆరవ తరగతి నుండి ఇంటర్ సెకండియర్ వరకు చదువుతున్నారు. ఈ పాఠశాలలో 9 నుంచి ఇంటర్ సెకండియర్ వరకు 100 మంది ఆడపిల్లలు పాఠశాలలో ఉన్న వసతిగృహంలో ఉంటున్నారు. హాస్టల్‌కు లేడీ వాచ్‌మెన్ ఉన్నారు. ఈ పాఠశాల జీవీకే స్టాక్ పాయింట్‌గా ఉంది. మండలంలో అన్ని స్కూళ్లకు పుస్తకాలు, బూట్లు, బట్టలు ఇక్కడ నుంచే సరఫరా అవుతున్నాయి.


ప్రహరీ, వాచ్‌మెన్ లేని అక్కివరం మోడల్ స్కూల్ ఇదే..

ఊరికి దూరంగా..

ఎపి మోడల్ స్కూల్ ఊరికి, మండల కేంద్రానికి దూరంగా ఉంది. ఇక్కడ నైట్ వాచ్మెన్, ప్రహరీ గోడ తప్పనిసరిగా ఉండు తీరాలి. కానీ ఈ రెండు ఇక్కడ లేవు. జగనన్న విద్యాకానుక కిట్లకు స్టాక్ పాయింట్ కావడం, పాఠశాలలో విలువైన కంప్యూటర్లు ఉండడంతో రాత్రి సమయంలో దొంగతనాలు జరిగే ప్రమాదం కూడా ఉంది. అయితే గత నవంబర్‌లో కొత్తవలస నుండి అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న వి. రమణమూర్తి ఇక్కడకు వాచ్‌మెన్‌గా బదిలీపై వచ్చారు. ఆ వాచ్‌మెన్ కలెక్టర్ పిఎకు బంధువు కావడంతో డిఇఒపై ఒత్తిడి తీసుకువచ్చి వెంటనే కలెక్టర్ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై తీసుకెళ్లిపోయారు. జీతం ఈ పాఠశాలలో తీసుకుంటున్నా పని మాత్రం కలెక్టర్ కార్యాలయంలో చేస్తున్నాడు. దీంతో ఇక్కడ రికార్డుల్లో వాచ్‌మెన్ ఉన్నట్టుగానే చూపించడంతో సంబంధిత అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. పాఠశాలపై దృష్టి పెట్టి డిప్యూటేషన్ పై వెళ్లిపోయిన వాచ్‌మెన్ రమణ మూర్తిని వెనుకకు పంపించాలని లేనియెడల వాచ్‌మెన్‌ను నియమించుకోవడానికి అవకాశమైనా కల్పించాలని అలాగే ప్రహరీ గోడ నిర్మించాలని విద్యార్థులు విద్యార్థులు తల్లిదండ్రులు పాఠశాల కమిటీ సభ్యులు కోరుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించకపోతే డిఇఒ, కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తామని చెబుతున్నారు

ప్రభుత్వ నిర్లక్ష్యమే శాపం

•నిలిచిపోయిన నాడు-నేడు పనులు • సామగ్రి కొరతే కారణం

ప్రజాశక్తి- డెంకాడ

ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పన ధ్యేయంగా నాడు నేడు పథకంలో రెండో దశలో ప్రభుత్వం కొన్ని పాఠశాలను ఎంపిక చేసింది. ఇంత వరకూ బాగానే ఉన్న ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల నాడు నేడులో మంజూరైన పనులు పాఠశాలలు ప్రారంభమైనప్పటికీ పూర్తి కాలేదు. రెండో దశ పనులు అస్తవ్యస్తంగా మారాయి. రెండో దశలో నాడు నేడులో ఎంపికైన పాఠశాలలకు నిధులు మంజూరు కాక పనులు నిలిచి పోయాయి.

మండలంలో రెండో దశ నాడు నేడులో 16 పాఠశాలలు ఎంపిక చేశారు. వీటికి గాను రూ.5.59కోట్లు నిధులు కేటాయించారు. అదనపు తరగతి గదులు కోసం 21 పాఠశాలలో రూ.3.59 కోట్లు నిధులు కేటాయించారు. తొలుత నెమ్మదిగా నిధులు మంజూరవడంతో పాఠశాలలో పనులు ప్రారంభమయ్యాయి. తరువాత నిధులు మంజూరు ఆగిపోవడంతో పనులు కూడా ఎక్కడి వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఆగిపోయాయి. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమైన తరువాత కూడా జూన్ నెల చివరినాటికి పనులు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే జూన్ పూర్తయి జూలై వచ్చినప్పటికీ ఇంత వరకూ కేవలం 40 శాతం పనులు కూడా జరగలేదు. ప్రభుత్వం చేపడుతున్న పనులకు మెటీరియల్, నిధులు సకాలంలో అందకపోవడంతోనే పనులు ఆగిపోయాయని కాంట్రాక్టర్లే చెబుతున్నారు. కేవలం ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యం వల్లే పాఠశాలలో పనులు పూర్తి కాలేదని చెబుతున్నారు.


మధ్యలో నిలిచిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణం

పుస్తకాల పరిస్థితీ అంతే

మండలంలో ఏడు జెడ్‌పి ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, మోడల్ స్కూల్ ఉన్నాయి. ఈ సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో 77శాతం వచ్చింది. ఒకటి నుంచి 10వ తరగతి వరకు 42,057 పుస్తకాలు అవసరం కాగా ప్రస్తుతం 37,918 పుస్తకాలు వచ్చాయి. ఇంకా 4,139 పుస్తకాలు రావాల్సి ఉంది. రెండో దశలో నిర్మాణం చేపడుతున్న పాఠశాలలన్నీ చివర దశలో ఉన్నాయని అవి త్వరలో పూర్తి చేస్తామని ప్రభుత్వం నుంచి రావాల్సిన మెటీరియల్ వల్ల పాఠశాల పనులు మందకొడుగా సాగుతున్నాయని ఇక్కడ విద్యాశాఖ అధికారులు తెలిపారు.

రేగిడి మండలానికి జూనియర్ కళాశాల

●అంబాడ వెంకటాపురం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు ● ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు ● ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని అంబాడ వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు మంజూరైనట్లు ప్రభుత్వం నుండి ఆదేశాలు అందాయని ఉన్నతాధికారులు ప్రజాశక్తికి తెలిపారు. ఇటీవల ప్రజాశక్తిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు కలేనా.? అనే కథనం ప్రచురించడంతో స్థానిక ఎంపిపి ధార అప్పల నరసమ్మ, వైస్ ఎంపిపిలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహన్‌రావులు ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లకు కథనం క్లిప్పింగును అందించారు. వీటిని పరిశీలించి ఆ క్లిప్పింగ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి విన్నవించారు. దీంతో తక్షణమే ముఖ్యమంత్రి స్పందించి పరిశీలించి మంజూరుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

మండలంలో 39 గ్రామపంచాయతీలు 52 రెవెన్యూ గ్రామాలతో పాటు మరో 16 గ్రామాలు ఉన్నాయి. ఎన్నో ఏళ్ల నుంచి 12 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉన్నా ఇంటర్ విద్య కోసం


ప్రజాశక్తి
www.prajasakti.com
విజయనగరం
జూనియర్ కళాశాల ఏర్పాటు కలేనా..?

కళాశాల ఏర్పాటు చేయాలని ప్రజాశక్తిలో వచ్చిన కథనం

ఇక్కడ కళాశాల లేకపోవడంతో పాలకొండ, రాజాం, శ్రీకాకుళం, విజయనగరం వంటి పట్టణాలకు వ్యయ, ప్రయాసలతో వెళుతున్నారు. కొంతమంది పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు అంత దూరం వెళ్లి చదువుకునే స్తోమత లేక విద్యకు దూరమవుతున్నారు. ఇదే అంశాన్ని ప్రజాశక్తిలో ఒక పేరా రూపంలో రాయడంతో చలించిపోయిన సిఎం తక్షణమే జూనియర్ కళాశాల మంజూరు చేయించారని అధికారులు చెబుతున్నారు. జూనియర్ కళాశాల మంజూరు కావడంతో మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, విద్యార్థులు, విద్యార్థులు తల్లిదండ్రుల ఎన్నో ఏళ్లనాటి కల నెరవేరిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జూనియర్ కళాశాల మంజూరు కావడంతో పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందే అవకాశం ఉందని చెబుతున్నారు.


నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఎన్‌కెఆర్‌పురంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో రిటైర్మెంట్ ఆర్మీ ఉద్యోగులు ఆదివారం ఐదుగురుకు సన్మానం చేసి పేదలకు దుస్తులు, నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. అనంతరం పలు గ్రామాల్లో కూర్చునేందుకు వీలుగా సిమెంట్ బల్లలు, అన్నదాతకు ఎరువులు పంపిణీ చేశామని క్లబ్ సభ్యులు కీర్తన, సీతా మహాలక్ష్మి, రీజనల్ చైర్ పర్సన్ సుశీల, జోనల్ చైర్మన్ వి సంపత్ కుమార్, వేపాడ క్లబ్ అధ్యక్షుడు కే కిషోర్ తెలిపారు.

ప్రజా సమస్యలపై జనసేన భారీ ర్యాలీ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ నాలుగేళ్లలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ మండలంలో మిమ్స్ నుంచి మొయిద కూడలి వరకూ ఆదివారం జనసేన ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టారు. ఆ పార్టీ నియోజకవర్గం నాయకులు లోకం మాధవి ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో పెద్ద ఎత్తున కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మద్యపాన నిషేధం, భోగాపురం మండలంలోని పరిష్కారానికి నోచుకోని బట్టి కాలువ సమస్య, గతేడాది నుండి పరిష్కారం కానీ ముంజేరు సిద్ధార్థ కాలనీ మురికి నీటి సమస్య, పరిష్కారానికి నోచుకోని చోడిపిల్లి పేట రహదారి సమస్య, చాకివలస గ్రామ ప్రజల ఫ్లోరైడ్ సమస్యతో బాధపడుతున్నారన్నారు. ముక్కాం ప్రజల తాగునీటి సమస్య, భోగాపురం మండలం రామచంద్ర పేట గ్రామంలో యదేచ్ఛగా సాగుతున్న మైనింగ్ మాఫియా, ఆర్అండ్ఆర్‌లో జరిగిన అవకతవకలతో ఇబ్బంది పడుతున్న భోగాపురం భూ నిర్వాసితుల సమస్య, చేపల కంచర గ్రామంలోని ఇళ్ల పట్టాల కంపెనీలో అవకతవకలు, ఫార్మా కంపెనీల వ్యర్థల వల్ల నాశనం అవుతున్న మత్స్య సంపద వాగ్దానాలకే పరిమితమైన జట్టి నిర్మాణం వంటి సమస్యలున్నాయన్నారు. గుణుపూరుపేట డంపింగ్ యార్డ్ సమస్య, రామతీర్థ సాగర్ ప్రాజెక్టు ఇలా మొదలగు సమస్యల పరిష్కారమే ధ్యేయంగా మొదలు పెట్టిన ఈ నిరసన ర్యాలీకి సామాన్య ప్రజల నుండి మంచి స్పందన లభించింది. వచ్చే పరిశ్రమలని కూడా అడ్డుకొని వాటాలు ఇవ్వమని నాయకులు మనకి అవసరమా అని ఆమె ప్రశ్నించారు. ఇళ్ల పట్టాల విషయంలో ఎంతో జాప్యం జరిగిందని వీటిపై తమ పోరాటం ఎప్పుడు ఆగదని పేదవాడి ఇంటికలే తమలక్ష్యమని తమ అధినాయకుడి పవన్ కల్యాణ్ ఈ సారి సిఎం అవ్వడం ఖాయమని ఈ జనాన్ని చూస్తే అర్థమవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


ర్యాలీ చేస్తున్న జనసేన నాయకులు, కార్యకర్తలు

పోలవరం సంఘీభావ నిధి సేకరణ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

పోలవరం నిర్వాసితులకు పునరావాసం కోసం గిరిజనులు చేస్తున్న న్యాయమైన పోరాటాన్ని ప్రజలంతా బలపరచాలని సిఐటియు జిల్లా నాయకులు ఎ. జగన్ మోహన్ రావు, యూఎస్ రవికుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నెల్లిమర్ల నగర పంచాయతీ కార్మికులు పోలవరం నిర్వాసితుల మహా పాదయాత్రకు సంఘీభావ నిధి సేకరించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ పోలవరం జాతీయ ప్రాజెక్టు కోసం లక్షల మంది గిరిజనులు తమ గ్రామాలలో భూములను త్యాగం చేశారని, 2006 నుంచి ఇప్పటివరకు అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం నిర్వాసితుల సమస్యలు పరిష్కరించకుండా ప్రాజెక్టు మేం పూర్తి చేస్తామంటే మేం చేస్తామని పోటీపడి గిరిజనులను జల సమాధి చేసేందుకు సిద్ధమవుతున్నారన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ ఎర్రజెండా నాయకత్వంలో గిరిజనులంతా ఏకమై పోలవరం పోరుకాక పేరుతో మహా పాదయాత్ర నిర్వహిస్తున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిర్వాసితులకు న్యాయం చేయాలని లేనిపక్షంలో వారు చేసే న్యాయమైన పోరాటంలో తాము భాగస్వామ్యం అవుతామని ప్రకటించారు. విరాళాలు ఇచ్చిన వారిలో సిఐటియు మండల నాయకులు కిల్లంపల్లి రామారావు, నగర పంచాయతీ కార్మిక నాయకులు దుర్గారావు లక్ష్మి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


విరాళాలు సేకరిస్తున్న సిఐటియు నాయకులు

సొంత ఖర్చుతో సుందరీకరణ పనులు

ప్రజాశక్తి - గజపతినగరం

చెత్తా చెదారంతో అపరిశుభ్ర వాతావరణంలో కొట్టు మిట్టాడుతున్న అగ్నిమాపక కార్యాలయాన్ని స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ఎంఎస్‌వి రవిప్రసాద్ తన సొంత ఖర్చు సుమారు రూ.లక్ష వ్యయంతో సుందరీకరణకు ప్రతినబునారు. కార్యాలయంలో పందికొక్కులు, ఎలుకలు రికార్డులను మాయచేస్తాయనే నిత్యం భయం, చిన్నపాటి వర్షాలకు స్లాబు నుండి వర్షపు నీరు విశ్రాంతి గదిలోకి కారటం, వలుపురు కొట్టడం వంటి సమస్యలతో రోజులు నెట్టుకొస్తున్న కార్యాలయ సిబ్బంది సమస్యలను చూసిన ఆయన కార్యాలయం అభివృద్ధిపై దృష్టి పెట్టారు. స్వతహాగా క్రమశిక్షణ, పరిశుభ్రతే ప్రాణంగా భావించే వ్యక్తి కావటంతో కార్యాలయ మార్పునకు శ్రీకారం చుట్టారు. విరిగిన తలుపులను మార్చి రంగులతో కూడిన కొత్త వాటిని అమర్చారు. ముక్కలు ముక్కలుగా పగిలిన గచ్చును మొత్తం తీయించి దాని స్థానంలో టైల్స్‌ను వేయించారు. పరిసరాల చుట్టు పక్కల పేరుకున్న చెత్తను తొలగించి శుభ్రం చేయించారు. సిబ్బంది వాహనాల నిలుపుదల చేసుకోడానికి స్థలం లేక వారు పడుతున్న ఇబ్బందులను గుర్తించి రేకుల షెడ్డు నిర్మాణాన్ని, విశ్రాంతి గది శ్లాబు, పక్క గోడ నిర్మాణాన్ని చేపట్టారు. అతను తీసుకున్న ఈ చర్యతో కార్యాలయ సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తూ ధన్యవాదాలు తెలుపుతున్నారు.



అభివృద్ధి చేసిన తరువాత కార్యాలయం

పైపులైన్ మరమ్మతులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - గుర్ల

మండలంలోని పల్లిగండ్రేడు గ్రామానికి వెళ్లే పైపులైన్ లీక్ అవ్వడం వల్ల తాగునీరు వృథాగా పోతుంది. ఈ నేపథ్యంలో తాగునీరు వృథా అన్న శీర్షికతో ఒకటో తేదీన ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి స్పందించిన సర్పంచ్ పెనుమల శంకరయ్య, సచివాలయం కార్యదర్శి కడగల సత్యం ఆదివారం తాగునీరు పైపులైన్ లీకేజీని పరిశీలించి మరమ్మత్తులు చేయించారు. గతంలో ఆదే ప్రదేశంలో ఒక పైప్‌ను డమ్మీ చేయగా అది మరలా లీకు కావడంతో పొలంలో తాగునీరు బయటకు వచ్చిందన్నారు. పైప్ లైన్ మరమ్మత్తులు పూర్తి కావడంతో తాగునీరు సరఫరా పూర్తి స్థాయిలో జరుగుతుందని సర్పంచ్ తెలిపారు. తాగునీరు, పారిశుధ్యం విషయంలో ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటామని సర్పంచ్ తెలిపారు.ఇప్పటికే గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నామన్నారు.

గొంప కృష్ణకు అభినందనలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కృష్ణరాయుడుపేట పంచాయతీ పరిధిలో గల అంకాజ్యోతిపాలెం గ్రామానికి చెందిని టిడిపి నియోజకవర్గ యువనేత గొంప కృష్ణను రాష్ట్ర కార్యదర్శిగా ఎంపిక చేయడం పట్ల టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఆదివారం ఒక ప్రకటనలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు, లోకేష్ ఆదేశాలు మేరకు కృష్ణ నియోజకవర్గం పరిధిలో గల అన్ని గ్రామాలను పర్యటించి ఆ గ్రామాలలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారిని సొంత నిధులతో ఆదుకుంటున్నారన్నారు. ఇటువంటి సేవలను గుర్తించిన చంద్రబాబు తక్కువ కాలంలోనే కృష్ణకు రాష్ట్రస్థాయిలో స్థానం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. ప్రజల్లోకి సేవా దృక్పదంతో దూసుకుపోయిన కృష్ణకు రానున్న ఎన్నికల్లో టిడిపి ఎమ్మెల్యే టిక్కెట్టు ఇస్తే కచ్చితంగా విజయ బావుటా ఎగురువేస్తామని చెప్పారు. గొంప కృష్ణ ఎదుగుదలను చూసి ఓర్వలేని కొంత మంది వారికి అనుకూలమైన పత్రికల్లో కృష్ణకు వ్యతిరేకంగా వార్తల రాయించే దుష్ప్రచారానికి ఒడిగడుతున్నారన్నారు. ప్రజలు ఆ వార్తలను నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు.


గొంప వెంకటరావు

కి'లేడి' అరెస్టు

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలో రిటైర్డ్ టీచర్ కె.వెంకట రమణమూర్తి నుంచి రూ.1.50లక్షలు నగదు అపహరించుకుపోయిన మాయలేడిను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. స్థానిక పోలీసులు స్టేషన్ డిఎస్‌పి పి.శ్రీధర్ ఆదివారం వివరాలు వెల్లడించారు. గతనెల 28న పూల్ బాగ్ కాలనీకు చెందిన రిటైర్డ్ టీచర్ వెంకటరమణమూర్తి నగదు విత్ డ్రా చేసేందుకు గాంధీబొమ్మ రోడ్డులో ఉన్న యూనియన్ బ్యాంకుకు వెళ్ళాడు. బ్యాంక్ ఖాతాలో ఉన్న రూ.1.50లక్షలు విత్ డ్రా చేసుకుని ఇంటికి వెళ్లేందుకు సిద్ధంగా ఉండగా సహాయం చేస్తున్నట్లు ఒకమహిళ నటించి రిక్షాలో అతన్ని ఎక్కించి అతనితో పాటు ఇంటి వరకు వెళ్లింది. ఆయన ఇంటిలోకి వెళ్తున్న సమయంలో బ్యాగ్ లాక్కుని అతన్ని ఇంటిలోకి నెట్టేసి తలుపునకు గెడ పెట్టి పరార్ అయింది. వెంటనే వృద్ధుడు పోలీసులకు పిర్యాదు చేయడంతో పట్టణ సిఐ నాగేశ్వరరావు, ఎస్ఐ సత్యనా రాయణ, కానిస్టేబుల్స్‌తో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు చేయగా గొల్లపల్లి గ్రామానికి చెందిన గొల్లపల్లి శ్రావణిగా గుర్తించి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించింది. శ్రావణి భర్త శివతో రాయగడ జెకెలో నివాసముంటుంది. అమ్మఒడి డబ్బులు కోసం శ్రావణి బ్యాంకుకు వచ్చి నేరం చేసినట్లు డిఎస్‌పి చెప్పారు. సిఐ నాగేశ్వరరావు, ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

నేరాలు ఘోరాలు

స్నేహితుడిపై హత్యాయత్నం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మండలంలోని ధర్మవరంలో ఒక శుభకార్యం వద్ద ఘోరం జరిగింది. ఫుల్లుగా మద్యం తాగిన ఇద్దరు స్నేహితులు గ్రామంలో జరుగుతున్న ఒక శుభకార్యం వద్దకు వెళ్లారు. అక్కడ పక్కనే ఉన్న గదిలోకి ఇద్దరు వెళ్లారు. అక్కడ ఏం జరిగిందో తెలియదు గానీ తన స్నేహితుడి మెడను చాకుతో మరో స్నేహితుడు కోసేసాడు. ఈ విషయంపై స్థానికులు మాట్లాడుతూ గ్రామానికి చెందిన కక్కల అప్పయ్య, నోట్ల బంగారుబాబు మంచి స్నేహితులు. వీరిద్దరూ గ్రామంలో జరుగుతున్న పాదం రాంబాబు ఇంట్లో శుభకార్యానికి ఆదివారం వెళ్లారు. శుభకార్యం సమీపంలో ఉన్న ఒక గదిలోకి ఇద్దరు వెళ్లారు. వెళ్లిన కాసేపటికి బంగారుబాబు మెడపై గాయంతో కేకలు వేస్తూ బయటకు వచ్చాడు. ఇదే సమయంలో చేతిలో చాకుతో కక్కల అప్పయ్య బయటకు వచ్చాడు. ఇది చూసిన స్థానికులు భయపడిపోయారు. వెంటనే గాయపడిన బంగారు బాబుని ఆటోలో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి హుటాహుటిన తీసుకెళ్లారు. వెంటనే డాక్టర్ ఉదయ్ కుమార్ బాధితుడికి చికిత్స అందించి చాకు లోతుగా దిగి ఉంటే ప్రాణాలు పోయేవని ప్రస్తుతం ప్రాణపాయం లేదని చెప్పారు. ఎస్ఐ తారకేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలపై ఆరా తీశారు.

పెదతరిమి వద్ద రణస్థలం వాసి మృతి

నెల్లిమర్ల: మండలంలోని పెదతరిమి వద్ద రణస్థలం మండలం వేలుపురాయి గ్రామానికి చెందిన బాలి దాలినాయుడు మృతి చెందాడు. ఆదివారం ఉదయం స్థానికులు గ్రామ శివారులో మృతదేహాన్ని గుర్తించి కుళ్లి, దుర్వాసన రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దాలినాయుడుగా గుర్తించారు. మృతుడు గత నెల 17న బ్యాంకకు వెళ్తానని చెప్పి ఇంటికి రాక పోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికారు. దొరకక పోవడంతో పోలిసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో పెద తరిమి గ్రామ శివారు మెట్టపై దాలినాయుడు మృత దేహం కనిపించింది. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

వంగర: మండలంలోని మద్దివలస సమీపంలో ఆదివారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో మన్యం జిల్లా గరుగుపల్లి మండలం రావు పల్లి గ్రామానికి చెందిన గుంట్రెడ్డి ఉమామహేశ్వరరావు (50) కి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉమామహేశ్వరరావు శ్రీకాకుళంలో గల తన స్నేహితుని వద్దకు వెళ్లి తిరుగు ప్రయాణంలో బైక్ పై వస్తుండగా మండలంలోని బంగారు వలస వైపు నుంచి వంగర వైపు ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో కింద పడిపోయాడు. ఆయనకు కుడి కాలు, ఎడమ చేయి విరిగిపోయినట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు అంబులెన్స్‌కి సమాచారమిచ్చి రాజాం ఆస్పత్రికి తరలించారు.